క్లుప్తంగా

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి



పాన్‌గల్: విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల శుభ్రతను పాటిస్తే రోగాలకు దూరంగా ఉండొచ్చని డా.హరీష్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు, ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులకు హెల్త్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందించారు. ఆరోగ్యం, పౌష్టికాహారంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన నియమాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రకాశంశెట్టి, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ సుదర్శన్‌రెడ్డి, అధ్యాపక బృందం, విద్యార్థులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

దళితులకు న్యాయం జరిగే వరకు పోరాటం



ఆత్మకూర్: దళితులు అన్ని రంగాల్లో వెనుకబడిపోతున్నారని, వర్గీకరణ చేపట్టి వారికి న్యాయం జరిగే వరకు ఉద్యమం ఉధృతం చేస్తామని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి అజ్జపాగ లక్ష్మణ్ అన్నారు. మంగళవారం ఆత్మకూర్ నుంచి ఎమ్మార్పీఎస్ నాయకులు కొత్తకోటలో మందకృష్ణ మాదిగ తలపెట్టిన రథయాత్రకు తరలివెళ్లారు. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే వర్గీకరణ చేపడుతామన్న కేంద్రం ప్రభుత్వం ఏర్పడి పదేళ్లు అవుతున్నా నేటికీ వర్గీకరణ చేపట్టక పోవడం విచారకరమన్నారు. కార్యక్రమంలో నాయకులు అజ్జపాగ మాసన్న, కట్టెలమిషన్ రాజు, గాలిపంపు శ్రీను, కర్రె శ్రీను, జానకీరాం, సోంబాబు, దండు శ్రీను, రేవల్లి శ్రీను తదితరులు ఉన్నారు.

రహదారుల నిర్మాణం పూర్తి చేయండి



ఆత్మకూర్: పట్టణంలో రహదారుల నిర్మాణం పూర్తి చేయకుండా అర్ధాంతంగా వదిలేయడంతో చెరుకును మిల్లుకు తరలించేందుకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. మంగళవారం కృష్ణవేణి చెరుకు సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు రాజన్న ఆధ్వర్యంలో రైతులు కమిషనర్ నాగరాజుకు వినతిపత్రం అందజేశారు. గాంధీచౌక్ నుంచి చెరువు కట్ట వరకు రోడ్డు నిర్మాణం కోసం తవ్వి వదలేయడంతో రైతులతో పాటు ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈవిషయమై సంబంధిత కాంట్రాక్టర్‌తో మాట్లాడి పనులు పూర్తయ్యే విధంగా చర్యలు తీసుకుంటామని కమిషనర్ హామీనిచ్చారు.

జీవాలకు పీపీఆర్ మందుల పంపిణీ



గోపాల్‌పేట: గొర్రెలు, మేకల కాపరులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండి వాటికి ఎటువంటి రోగాలు వస్తున్నాయో గమనించి ఎప్పటికప్పుడు మందులు వేయించాల్సిన అవసరం ఉందని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ మధుసూదన్ అన్నారు. మంగళవారం ఆయన మండలంలోని ఏదుట్లలో గొర్రెలు, మేకలకు పీపీఆర్ (పారుడు రోగం) నివారణ టీకాలు వేశారు. మొత్తం 3,200 గొర్రెలు, 84 మేకలకు పీపీఆర్ టీకాలు పంపిణీ చేశారు. ఆయనతో పాటు వెటర్నరీ అసిస్టెంట్ డైరెక్టర్ వెంకటేశ్వర్‌రెడ్డి, డాక్టర్ ఉదయ్‌కుమార్‌రెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

'ప్రజాభేరి' సభకు తరలిన నాయకులు



పాన్‌గల్: కొల్లాపూర్ నియోజకవర్గ కేంద్రంలో మంగళవారం నిర్వహించిన పాలమూరు ప్రజాభేరి సభకు మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల నుంచి కాంగ్రెస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో పలు వాహనాల్లో తరలివెళ్లారు. ఏఐసీసీ జాతీయ కోఆర్డినేటర్ డా.కేతూరి వెంకటేష్, పాన్‌గల్ ఎంపీటీసీ హైమావతి, మాజీ ఎంపీపీ వెంకటేష్‌నాయుడు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు రవికుమార్, గోవర్దన్‌సాగర్ ఆధ్వర్యంలో పలువురు సభకు తరలివెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేసీఆర్ అవినీతి పాలనకు చరమగీతం పాడతామన్నారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఒకే పాఠశాలలో 'అల్పాహారం'

- మండలంలోని అన్ని పాఠశాలల్లో అమలు చేయాలి
- బిల్లుల చెల్లింపులో జాప్యంతో వంట ఏజెన్సీలు వెనకడుగు



దావాజిపల్లి యూపీఎస్‌లో అల్పాహారం వడ్డిస్తున్న సిబ్బంది

పాన్‌గల్: సర్కార్ బడుల్లో చదివే విద్యార్థుల ఆకలి తీర్చే 'ముఖ్యమంత్రి అల్పాహార పథకం' అమలు అనుకున్నంత వేగంగా విస్తరించడం లేదు. తొలి విడతలో నియోజకవర్గానికి ఒకటి చొప్పున బడిని ఎంపిక చేశారు. తాజాగా రెండో విడతలో మండలానికి ఒక పాఠశాలలో ఈ పథకం అమలు చేస్తున్నారు. దసరా సెలవుల అనంతరం అన్ని పాఠశాలల్లో అల్పాహార పథకం అమలు చేస్తామని ప్రకటించినా.. ఆచరణలో సాధ్యం కావడం లేదు. పాన్‌గల్ మండలంలో కేవలం దావాజిపల్లి యూపీఎస్‌ను, వీపనగండ్ల ప్రాథమిక పాఠశాలలోనే కొనసాగిస్తున్నారు. చిన్నంబావి మండలంలో ఇంకా ప్రారంభించలేదు.

విడతల వారీగా పెంపు..

విడతల వారీగా సీఎం అల్పాహార పథకం మిగతా పాఠశాలల్లో వర్తింపజేయనున్నట్లు విద్యాశాఖ అధికారులు పేర్కొన్నారు. ప్రతి వారం పాఠశాలల జాబితాను విడుదల చేస్తామన్నారు. ఆహార పట్టిక ప్రకారం రోజుకోరకమైన అల్పాహారం వండిపెట్టాలని అధికారులు పాఠశాలల హెచ్‌ఎంలకు సూచించారు.

సమస్యలు అధిగమిస్తేనే..

విద్యార్థులకు ఉదయం వేళల్లో అల్పాహారం అందించాలన్న ప్రభుత్వ ఆలోచన మంచిదే అయినా.. క్షేత్ర స్థాయిలో ఏర్పడే చిన్నచిన్న సమస్యలను అధిగమిస్తేనే సత్ఫలితాలు వస్తాయి. ప్రధానంగా మధ్యాహ్న భోజనం సిద్ధం చేస్తున్న ఏజెన్సీల్లో చాలా మందికి ప్రభుత్వం పట్టికలో పేర్కొన్న అల్పాహారాల తయారీపై అవగాహన లేదు. దీంతో పాటు తయారీకి అవసరమైన వస్తు సామగ్రి లేదు. అల్పాహార పట్టిక, అందులోని పదార్థాల తయారీపై నిర్వాహకులకు తగిన శిక్షణ అందిస్తేనే ప్రయోజనం కలుగుతుంది. ప్రస్తుతం అల్పాహారం కోసం ఒక్కో విద్యార్థికి ప్రభుత్వం రూ.10 వరకు చెల్లించనుంది. ఈ డబ్బులు ఏమాత్రం సరిపోయే అవకాశం లేదు. దీనివల్ల నాణ్యత దెబ్బతినే ప్రమాదముంది.

మండలాల వారీగా..

మండలం	పాఠశాలలు	విద్యార్థులు
పాన్‌గల్	50	3464
వీపనగండ్ల	27	1856
చిన్నంబావి	30	1872

సరుకులు అందించాలి..

సరకులు, వంట పాత్రలు ఉచితంగా సరఫరా చేస్తేనే అల్పాహారం వండిపెడతామని, లేకుంటే తమ వల్ల కాదని పలు పాఠశాలల్లోని వంట ఏజెన్సీలు స్పష్టం చేశారు. ఇప్పటికే మధ్యాహ్న భోజన నెలవారీ బిల్లులు సక్రమంగా రాక అప్పులు చేయాల్సి వస్తోందని, అల్పాహారం విషయంలో స్పష్టమైన జీఓ విడుదల చేశాకే అమలు చేయాలని, దీంతో పాటు సరుకులు ఇచ్చి రోజుకు రూ. 800 వేతనం ఇస్తే తమకు ఆమోదయోగ్యమని వంట ఏజెన్సీ మహిళలు తెలిపారు.

అన్ని పాఠశాలల్లో అమలు చేయాలి



సీఎం అల్పాహార పథకం అమలును అన్ని పాఠశాలల్లో ప్రారంభించాలి. ఉదయం వేళల్లో చాలా మంది విద్యార్థులు ఇంటి వద్ద తినకుండానే పాఠశాలకు వస్తారు. అలాంటి విద్యార్థులకు ఎంతో ప్రయోజనంగా ఉంటుంది.

– ఉదయ్‌కుమార్, 7వ తరగతి, హైస్కూల్, వీపనగండ్ల

నిరంతరం కొనసాగించాలి..



ఏదో ముక్కుబడిగా పథకాన్ని అమలు చేయకుండా నిరంతరం ఉదయం పూట విద్యార్థులకు అల్పాహారం అందించాలి. విద్యార్థులకు సరిపోయేలా అల్పాహారం అందిస్తే ఉపాధ్యాయులు బోధించే పాఠ్యాంశాలను సక్రమంగా వింటూ పరీక్షల్లో మంచి మార్కులు సాధిస్తారు.

– రాధిక, 7వ తరగతి, యూపీఎస్, దావాజిపల్లి

విద్యార్థులకు ఎంతో ఉపయోగకరం



ప్రభుత్వ పాఠశాలల్లో ఉదయం వేళ సీఎం అల్పాహార పథకం అమలుతో పేద విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. ప్రస్తుతం మండలానికి ఒక పాఠశాల చొప్పున పాన్‌గల్, వీపనగండ్ల మండలాల్లో అమలు చేస్తున్నాం. చిన్నంబావి మండలంతో పాటు అన్ని పాఠశాలల్లో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విడతల వారీగా అల్పాహార పథకం అమలు చేస్తాం.

– లక్ష్మణ్‌నాయక్, ఎంఈఓ, పాన్‌గల్.

'నోటుకు ఓటు చరిత్ర వాళ్లదే'



మాట్లాడుతున్న పుర చైర్మన్ గట్టుయాదవ్

వనపర్తి టౌన్: నోటుకు ఓటు కేసు టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిపైనే ఉందని, ఆయన మరొకరిని విమర్శించడం విడ్డూరంగా ఉందని మున్సిపల్ చైర్మన్ గట్టుయాదవ్ ఎద్దేవా చేశారు. హైదరాబాద్‌లోని పాతబస్తీలో అల్లర్లు, కర్ఫ్యూలు కాంగ్రెస్ హయాంలోనే జరిగాయని, కేసీఆర్ పాలనలో ఇప్పటి వరకు ఎలాంటి సంఘ విద్రోహ ఘటనలు జరగలేదని గుర్తుచేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఇంట్లో తల్లిదండ్రుల పెంపకంతోనే పిల్లలు క్రమశిక్షణతో పెరుగుతారని, నాయకులు ఎలా ఉంటారో కార్యకర్తలు సైతం అలానే ఉంటారని చెప్పారు. పచ్చని తెలంగాణలో కాంగ్రెస్ నాయకులు నెత్తురు మరకలను అంటిస్తూ రాష్ట్రాన్ని నాశనం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని పేర్కొన్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్ రమేష్‌గౌడ్, పుర వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్ మాట్లాడుతూ... దేశంలో ఏ సీఎం చేయని అభివృద్ధి, సంక్షేమం కేవలం కేసీఆర్ హయాంలోనే జరిగిందన్నారు. కార్యక్రమంలో నందిమల్ల అశోక్, అరుణ్‌ప్రకాష్, పరంజ్యోతి, నందిమల్ల రమేష్, కుమార్, ఆరీఫ్, రామస్వామి, దిలీప్ కుమార్‌రెడ్డి, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

పాన్‌గల్: మండలంలోని కొత్తపేట సమీపంలో ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ పట్టుబడిన ఘటన మంగళవారం సాయంత్రం చోటు చేసుకుందని ఎస్‌ఐ వేణు తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తపేట సమీపంలో బ్లూ కోర్టు విధులు నిర్వహిస్తున్న పీసీ అశోక్ కుమార్ కొత్తపేట వైపు నుంచి వస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను ఆపి అనుమతి పత్రాలు చూపించాలని కోరగా.. అనుమతులు లేకపోవడంతో ఇసుక ట్రాక్టర్‌ను స్టేషన్‌కు తరలించి డ్రైవర్ రాములుపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తే వారిపై కఠిన చర్యలు తప్పవని ఎస్‌ఐ పేర్కొన్నారు.

ఆత్మీయ సమ్మేళనానికి తరలిరావాలి

పెబ్బేరు రూరల్: జిల్లా కేంద్రంలో ఈనెల 2న నిర్వహించనున్న వాల్మీకుల ఆత్మీయ సమ్మేళనానికి శ్రీరంగాపూర్ మండలంలోని వివిధ గ్రామాల వాల్మీకులు పెద్ద ఎత్తున తరలిరావాలని వాల్మీకి సంఘం మండల అధ్యక్షుడు సంపత్‌నాయుడు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రంగస్వామి పిలుపునిచ్చారు. మంగళవారం నాగరాలలో వాల్మీకి బోయలను కలిసి హక్కుల కోసం పోరాడాలన్నారు. కార్యక్రమంలో కన్నయ్య, కృష్ణయ్య, బాలచంద్రయ్య, మహేష్, తిరుపతి, లోకేష్, బాలస్వామి, వెంకటేష్, బాలకృష్ణయ్య, తిరుపతయ్య, నర్సింహనాయుడు తదితరులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్ ఉపాధ్యాయుడికి డాక్టరేట్



డాక్టరేట్ అందుకుంటున్న నరేష్‌కుమార్

కొత్తకోట రూరల్: మండలంలోని మోడల్ స్కూల్‌లో తెలుగు ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న తూర్పింటి నరేష్‌కుమార్ పీహెచ్‌డీ పట్టా అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహబూబ్‌నగర్ జిల్లా సాహితీ సంస్కృతి అంశాల పరిశీలన అనే అంశంపై ఉస్మానియా ప్రొఫెసర్ బూర్గుల కేశవులు పర్యవేక్షణలో పీహెచ్‌డీ పూర్తి చేశారు. మంగళవారం ఉస్మానియా విశ్వవిద్యాలయం ఠాగూర్ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన 83వ స్నాతకోత్సవంలో అడోబ్ సీఈఓ శంతన్ నారాయణన్, ఉస్మానియన్ వైస్ ఛాన్సలర్ రవీందర్‌యాదవ్ చేతుల మీదుగా డాక్టరేట్ పట్టాను అందుకున్నట్లు తెలిపారు. నరేష్‌కుమార్ డాక్టరేట్ పట్టాను అందుకోవడంపై వనపర్తి జిల్లా సాహితీవేత్తలు డాక్టర్ వీరయ్య, డాక్టర్ నర్సింహాశర్మ, కందూరు నారాయణరెడ్డి, బైరోజు చంద్రశేఖర్, ఉప్పరి తిరుమలేష్, సుధాకర్‌చారి, డాక్టర్ శ్యాంసుందర్, ఆవుల సైదులు, గుడిసె శివలింగం, సత్తార్ తదితరులు అభినందనలు తెలిపారు.

ఆర్థికసాయం అందజేత



పాన్‌గల్: మండల కేంద్రానికి చెందిన ఆదిరాజు అనారోగ్యంతో మంగళవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎంపీపీ మామిళ్లపల్లి శ్రీధర్ రెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.5 వేల నగదును అందజేశారు. వారికి అండగా ఉంటామని భరోసా కల్పించారు. గకార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు తిరుపతినాయుడు, మాజీ సర్పంచ్ ఆదిచంద్రయ్య, హన్మంతు తదితరులు పాల్గొన్నారు.

నేడు రక్తదాన శిబిరం

ఖిల్లాఘనపురం: కలెక్టర్ ఆదేశానుసారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ఇండియన్ రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు తహసీల్దార్ పాండునాయక్, ఎంపీడీఓ విజయ్‌కుమార్, రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు అహ్మద్ మంగళవారం సంయుక్త ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 11 గంటలకు ఎంపీడీఓ కార్యాలయంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేస్తామన్నారు. మండలంలోని ప్రతి గ్రామం నుంచి యువకులు పెద్ద సంఖ్యలో రక్తదానం చేయాలని కోరారు.

ఇంటింటికీ సంక్షేమ పథకాలు



నాటవెల్లిలో ప్రచారంలో చేస్తున్న జెడ్పీవైస్ చైర్మన్ వామన్‌గౌడ్, ఎంపీపీ గుంత మౌనిక

కొత్తకోట రూరల్: కేసీఆర్ పాలనలో ఇంటింటికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి సతీమణి వాసంతి అన్నారు. పెద్దమందడి మండలంలోని మనిగిళ్లలో మంగళవారం బీఆర్‌ఎస్ ఎన్నికల మేనిఫెస్టోను ఇంటింటికీ అందిస్తూ నిరంజన్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మంత్రి కూతురు తేజస్విని, మధులత, జ్యోతి, అనురాధ, సాయిలీల, లక్ష్మి, శ్రీనివాస్‌గౌడ్, మోహన్, సూర్యవంశం గిరి, శివ ఉన్నారు.

నాటవెల్లిలో..

మండలంలోని నాటవెల్లిలో జెడ్పీవైస్ చైర్మన్ వామన్‌గౌడ్, ఎంపీపీ గుంత మౌనిక ఇంటింటికీ తిరుగుతూ కారు గుర్తు ఓటు వేయాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. దేవరకద్ర నియోజకవర్గ అభివృద్ధి కోసం నిరంతరం శ్రమిస్తున్న ఆల వెంకటేశ్వర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సీడీసీ చైర్మన్ చెన్నకేశవరెడ్డి, భీంరెడ్డి, ఎద్దుల నాగేష్, సర్పంచ్ ఎద్దుల లావణ్య, అల్లబాషా తదితరులు ఉన్నారు.

కానాయపల్లిలో.

మండలంలోని కానాయపల్లిలో వైస్ ఎంపీపీ వడ్డె శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో హోటల్ రాజునాయుడు, గోవర్ధన్‌నాయుడు, డీసీ రాములు, వడ్డె నాగరాజు, బాజ గిరన్న, శాంతన్న ఉన్నారు.

ఆత్మకూర్: మక్తల్ నియోజకవర్గ అభివృద్ధి ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డికే సాధ్యమని, మరోసారి ఆయనను భారీ మెజారిటీతో గెలిపించాలని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రవికుమార్‌యాదవ్ అన్నారు. మంగళవారం పట్టణంతో పాటు మండల పరిధిలోని గ్రామాల్లో ముమ్మరంగా ప్రచారం చేసారు. కార్యక్రమంలో చైర్‌పర్సన్ గాయత్రి, వైస్‌చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, ఎంపీపీ బంగారుశ్రీను, శ్రీధర్‌గౌడ్, జెడ్పీటీసీ శివరంజని, కృష్ణమూర్తి, లక్ష్మీకాంత్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, కోటేష్ పాల్గొన్నారు.



ఖిల్లాఘనపురంలో ప్రచారం చేస్తున్న డాక్టర్ సింగిరెడ్డి ప్రత్యూష

మరోసారి మా నాన్నను ఆశీర్వదించండి

ఖిల్లాఘనపురం: అభివృద్ధిని చూసి మరోసారి వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డికి ఎమ్మెల్యేగా అవకాశం ఇవ్వాలని ఆయన కూతురు డాక్టర్ ప్రత్యూష మండల కేంద్రంలో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం సాధించేందుకు కేసీఆర్‌తో నిరంజన్‌రెడ్డి పోరాడారని గుర్తు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ వెంకటరమణ, మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు రాళ్ల కృష్ణయ్య, జిల్లా వ్యవసాయ మార్కెట్ మాజీ అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, జిల్లా కార్మిక సంఘం అధ్యక్షుడు విక్రం పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణకు సహకరించాలి



ప్రత్యేక బలగాలతో కలిసి కవాతు నిర్వహిస్తున్న సీఐ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్‌ఐ మంజునాథ్‌రెడ్డి

కొత్తకోట రూరల్: ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కొత్తకోట సీఐ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్‌ఐ మంజునాథ్‌రెడ్డి ప్రజలను కోరారు. పట్టణ కేంద్రంలోని ప్రధాన వీధుల గుండా కేంద్ర బలగాలతో కలిసి ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. కొత్తకోట చౌరస్తా నుంచి హనుమాన్ టెంపుల్, చర్చి ఏరియా, మజీద్, దండుగడ్డ కాలనీల్లో కవాతు చేశారు. పట్టణ కేంద్రంతో పాటు గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా నిత్యం పోలీస్ నిఘా ఉంటుందని ఎస్‌ఐ మంజునాథ్‌రెడ్డి అన్నారు. ఉన్నతాధికారుల ఆదేశానుసారం ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల వద్ద ప్రతి రోజు ముమ్మరంగా తనిఖీలు చేస్తున్నామని, ఎన్నికల నిబంధనలు అతిక్రమించిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ హెచ్చరించారు.

అవినీతి ప్రభుత్వానికి చరమగీతం



నాయకులకు పార్టీ కండువా కప్పుతున్న మహేష్‌కుమార్‌గౌడ్

కొత్తకోట/మదనాపురం: ఉమ్మడి కొత్తకోట మండల జెడ్పీటీసీ మాజీ సభ్యుడు రావుల జితేంద్రనాథ్ రెడ్డి, మదనాపురం మండలంలోని దుప్పల్లికి చెందిన సీసీకుంట మండల మాజీ ఎంపీపీ అనుసూయమ్మ, మహాదేవ్‌గౌడ్ దంపతులు నియోజవర్గ కాంగ్రెస్ అభ్యర్థి జి.మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం హైదరాబాద్‌లోని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్‌కుమార్‌గౌడ్ అధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి మహేష్‌కుమార్‌గౌడ్ కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మహేష్‌కుమార్ గౌడ్ సీఎం కేసీఆర్‌ను గద్దె దించేందుకు కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమవుతుందని, అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేకూరుతుందని నమ్మి వివిధ పార్టీలకు చెందిన వారు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారన్నారు. అభ్యర్థి గెలుపు కోసం అందరు కలిసికట్టుగా పనిచేయాలని సూచించినట్లు కాంగ్రెస్ శ్రేణులు తెలిపారు. కార్యక్రమంలో పి.కృష్ణారెడ్డి, ఎల్లంపల్లి నరేందర్‌రెడ్డి, చర్లపల్లి సర్పంచ్ శేఖర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సాయిరెడ్డి, మాసన్న, యాదగిరి, వడ్డె కృష్ణ, విజయ్, వాకిటి బాలరాజు ఉన్నారు.

ఆస్పత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంచాలి



మాట్లాడుతున్న పీహెచ్‌సీ డాక్టర్ నాగరాజు

పాన్‌గల్: ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, వైద్య సేవలను గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తూ ప్రతి గర్భిణి పీహెచ్‌సీలోనే కాన్పులు చేయించుకునేలా వైద్య సిబ్బంది అవగాహన కల్పించాలని పీహెచ్‌సీ డాక్టర్ నాగరాజు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో వైద్య సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించి ఆరోగ్య అభివృద్ధి కార్యక్రమాల అమలుపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణుల నమోదు, పరీక్షలు, ప్రసవాలు వంద శాతం అమలు అయ్యేలా చూడాలన్నారు. చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు, గర్భస్థ, మానసిక ఆరోగ్య పరీక్ష పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. వైద్య సిబ్బంది వారికి కేటాయించిన గ్రామాల్లో అందుబాటులో ఉంటూ వైద్య సేవలు అందించాలన్నారు. విధుల్లో అలసత్వం వహించే సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో సూపర్‌వైజర్లు శ్రీనివాస్, సంతోషమ్మ, సుమనశ్రీ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంపై పట్టింపేది ?



శివగార్డెన్ సమీపంలో గల కాలనీలో ఇళ్ల మధ్య చేరిన మురుగు

కొత్తకోట రూరల్: డ్రెయినేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో ఇళ్ల నుంచి నుంచి వచ్చే మురుగు ఇళ్ల మధ్యలో గల ఖాళీ స్థలంలో చేరడంతో దుర్వాసన రావడంతో పాటు అనారోగ్యానికి గురవుతున్నామని కాలనీవాసులు వాపోతున్నారు. పట్టణ కేంద్రంలోని 6వ వార్డులో గల శివగార్డెన్ సమీపంలోని కాలనీలో డ్రెయినేజీలు లేకపోవడంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాలనీలో డ్రెయినేజీలు, సీసీ రోడ్లు ఏర్పాటు చేయాలని మున్సిపల్ కమిషనర్, చైర్‌పర్సన్‌కు వినతిపత్రం ఇచ్చినా పట్టించుకోవడం లేదని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాలకులు పారిశుద్ధ్యం గురించి పట్టించుకోకపోవడంతో మురుగుపై ఈగలు, దోమలు వ్యాప్తి చెంది మలేరియా, టైఫాయిడ్, డెంగ్యూ వంటి వ్యాధుల సక్రమించే ప్రమాదం ఉందని వాపోతున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ పాలకవర్గం, అధికారులు ప్రత్యేక చొరవ తీసుకుని పారిశుద్ధ్యంపై దృష్టి సారించాలని కాలనీవాసులు వేడుకుంటున్నారు.

జాయింట్ సెక్రటరీగా అక్తర్



అక్తర్‌కు నియామక పత్రాన్ని అందజేస్తున్న టెంట్ హౌస్ కమిటీ సభ్యులు

వనపర్తి టౌన్: ఆల్ ఇండియా టెంట్ హౌస్ జాయింట్ సెక్రటరీగా పట్టణానికి చెందిన సయ్యద్ అఖ్తర్ నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం మహబూబ్‌నగర్ జిల్లాలోని ఓ ఫంక్షన్ హాల్‌లో అఖిల భారత టెంట్ హౌస్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ కర్తర్ సింగ్ సయ్యద్ అఖ్తర్‌ను సన్మానించి, నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పేదలకు లాభం ఆశించకుండా లాభం లేని ధరకే టెంట్ సామాన్లను అందజేస్తున్నాడని, అఖ్తర్ మరిన్ని సేవలు అందించాలని ఆకాంక్షించారు. వనపర్తి పట్టణానికి చెందిన అఖ్తర్‌కు ఆల్ ఇండియా స్థాయిలో పదవి రావడం అఖ్తర్‌కే కాకుండా, వనపర్తికే గర్వకారణమన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర టెంట్ హౌస్ సభ్యులు రఘుపతి, ముస్తఫా ఆలీ, కిషోర్ కుమార్. వంశీ కృష్ణ, మహబూబ్‌నగర్ జిల్లా సభ్యులు అనీస్, మెరాజ్, యూసుఫ్, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

సర్దార్ వల్లభాయ్ సేవలు చిరస్మరణీయం



వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు, లెక్చరర్లు

కొత్తకోట రూరల్: స్వాతంత్య్ర సమరయోధుడు, దేశ తొలి హోంశాఖ మంత్రి సర్దార్ వల్లబాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని జాతీయ సమైక్యత దినోత్సవాన్ని మోజర్ల ఉద్యాన కళాశాలలో విద్యార్థులు, లెక్చరర్లు ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా కళాశాల అసోసియేట్ డీన్ పిడుగం సైదయ్య మాట్లాడుతూ దేశ సమైక్యతను కాపాడేందుకు పటేల్ చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. అనంతరం ఉపన్యాస పోటీలు నిర్వహించారు. ఉపన్యాస పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఓఎస్‌ఏ డాక్టర్ షహనాజ్, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు బేబీరాణి, విద్య, సీనియర్ ఉపాధ్యాయులు పూర్ణిమ మిత్ర, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ భాగ్యశాలి, నవ్య, శ్వేత తదితరులు పాల్గొన్నారు.

సత్తెన్న నమస్తే.. 'చెయ్యి' మరువొద్దే..

అమరచింత: పట్టణంలోని ప్రధాన రహదారుల వెంట మంగళవారం కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి ప్రధాన రహదారి వెంట ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి వెళ్తున్న సమయంలో పట్టణానికి చెందిన మాట నత్తి-పాట కత్తి అనే పేరును సార్థకం చేసుకున్న గాయకుడు సత్యనారాయణ కనపడటంతో నమస్తే సత్తెన్న.. చెయ్యి గుర్తు మరువొద్దన్న అంటూ ఆప్యాయంగా పలకరించి ఓటు వేయమని కోరారు.



నేటి నుంచి పాండురంగస్వామి బ్రహ్మోత్సవాలు



ఆత్మకూర్: మండలంలోని మూలమల్లలో పాండురంగ స్వామి బ్రహ్మోత్సవాలు బుధవారం నుంచి ప్రారంభం అవుతున్నాయని ఆలయ ప్రధాన అర్చకులు శ్రీధర్ జ్యోషి తెలిపారు. బుధవారం పాండురంగస్వామి, రుక్మిణిమాత కల్యాణం, స్వామివారి ఆభరణాల ఊరేగింపు, ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నామన్నారు. అలాగే గురువారం పాండురంగస్వామివారి రథోత్సవం, మహామంగళహారతి, ప్రసాద వితరణ ఇతర పూజ కార్యక్రమాలు ఉంటాయని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని బ్రహ్మోత్సవాలను జయప్రదం చేయాలని నిర్వాహకులు కోరారు.